నేడు 'డయల్‌ యువర్‌ ఆర్టీసీ డీఎం'

గోల్కొండ: నేడు 'డయల్‌ యువర్‌ ఆర్టీసీ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మెహిదీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్‌ డివికె. మూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు ప్రయాణికులు, కాలనీ సంక్షేమ సంఘాలు, వ్యాపారుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలిపారు. సలహాలు, అభిప్రాయాలు తెలియజేయాలనుకునేవారు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 వరకు 9959226133 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నారాయణ పాఠశాలలో 'మాస్టర్‌ చెఫ్‌'


వంటకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

విజయనగర్‌కాలనీ: స్థానిక నారాయణ ఈ టెక్నో పాఠశాలలో బుధవారం మాస్టర్‌ చెఫ్‌ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు వివిధ రకాల వంటకాలను తయారు చేసి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు తినిపించారు. అలాగే వంటకాల తయారీ విధానం, వాటిలోని పోషక విలువలను వివరించారు. కార్యక్రమంలో విద్యావేత్తలు గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌ గంగాకిరణ్‌, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. వంటల తయారీలో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు.

రెజ్లింగ్‌ పోటీలు షురూ



గోల్కొండ: కార్వాన్‌లోని మార్కండేయ స్వామి భవనంలో బుధవారం రెజ్లింగ్‌ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కార్వాన్‌ పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఉత్తరపల్లి కృష్ణ మాట్లాడుతూ.. జై మార్కండేయ శ్రీ మార్కండేయ స్వామి జన్మత్సోవాల్లో భాగంగా మూడేళ్లుగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రెజ్లింగ్‌ కోచ్‌ విశాంభర్‌, దోర్నాల ప్రసాద్‌, గుడిమల్కాపూర్‌ బీజేపీ డివిజన్‌ అధ్యక్షులు దేవర వంశీ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యాలయ సహ కార్యదర్శి ప్రభుపూజారి తదితరులు ఉన్నారు. విజేతలుగా నిలిచిన వారికి మార్కండేయ కేసరితో సత్కరిస్తామని ఆర్గనైజింగ్‌ కమిటీ అధ్యక్షుడు ఉత్తరపల్లి దయానంద్‌ అన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

యాకుత్‌పురా: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ వ్యక్తిగత భద్రతపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని షాహీన్‌ ఉమెన్స్‌ రిసోర్స్‌ అండ్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి జమీలా నిషాత్‌ సూచించారు. షాహీన్‌ అసోసియేషన్‌ నషేమన్‌నగర్‌ బ్రాంచ్‌ ఆధ్వర్యంలో మహిళలకు మానసిక ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసంపై బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలను చైతన్యవంతులను చేసేందుకే ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పలువురు షాహీన్‌ సభ్యులు దేవకి, ఫర్హాన, అర్చన, బుష్రా మహిళా సాధికారితపై ప్రసంగించారు. స్థానిక ప్రాంతాలకు చెందిన మహిళలు, బాలికలు పాల్గొన్నారు.

ప్రొఫెసర్‌ దశరథరెడ్డి సేవలు మరువలేనివి


నివాళులర్పిస్తున్న వీసీ ప్రొఫెసర్‌ గంగాధర్‌ తదితరులు

విజయనగర్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ప్రొఫెసర్‌ కె.దశరథరెడ్డి సేవలు మరువలేనివని జేఎన్‌ఏఎఫ్‌ఏయూ వీసీ టి.గంగాధర్‌ అన్నారు. మాసబ్‌ట్యాంక్‌ జవహర్‌లాల్‌ నెహ్రూ ఆర్కిటెక్చర్‌ అండ్‌ ఫైనార్ట్స్‌ యూనివర్శిటీ ప్రాంగణంలోని ఆడిటోరియం హాల్‌లో ఇటీవల మృతిచెందిన జేఎన్‌ఏఎఫ్‌ఏయూ విశ్రాంత ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ కె.దశరథరెడ్డి సంతాప సభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దశరథరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు ఉమ్మడి రాష్ట్ర సీఎం డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డితో ప్రొఫెసర్‌ దశరథరెడ్డికి ఉన్న సత్సంబంధాలను గుర్తుచేసుకున్నారు. మాసబ్‌ట్యాంక్‌ యూనివర్శిటీ ఏర్పాటుకు ఆయన చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. మాజీ వీసీ పేర్వారం పద్మావతి, సినీ నటుడు అల్లు అర్జున్‌ మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి, యూనివర్శిటీ అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌, బోధనేతర సిబ్బంది సంఘం అధ్యక్షుడు కోమటిరెడ్డి మహిపాల్‌రెడ్డి, రమణారెడ్డి, విశ్రాంత పిన్సిపాల్‌ పీరన్‌, టి.విఠల్‌, మాజీ రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ సి.యశోదర్‌ రావు పాల్గొన్నారు.

నిలోఫర్‌ నురుగుమయం..!

- పైప్‌లైన్‌ లీక్‌
- బయటకు వచ్చిన కెమికల్స్‌
- ఇబ్బందుల్లో వైద్యులు, రోగులు
- అరికట్టాలంటూ విజ్ఞప్తులు

నాంపల్లి: ఏడాది కిందటే కోట్లాది రూపాయలు వెచ్చించి ఆధునీకరించిన నిలోఫర్‌ ఆసుపత్రి పాత బిల్డింగ్‌లో వైఫల్యాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. పై అంతస్తులోని ల్యాబోరేటరీ నుంచి బయటకు వెళ్లే కెమికల్స్‌ పైప్‌ లీక్‌ కావడంతో కింది ఫ్లోర్‌లోని ఆసుపత్రి ఆవరణమంతా నురుగుమయంగా మారుతోంది. ఈ కెమికల్‌ నురుగును దాటుకుని రోగులు, వైద్యులు ముందుకు వెళ్లలేక నానా అవస్థలు పడ్డారు. ఉదయం నుంచి కెమికల్‌ నీరు మ్యాన్‌హోల్స్‌ నుంచి లీకై బయటకు వస్తోంది. ఇక్కడే కోట్లాది రూపాయల విలువ చేసే అత్యాధునిక వైద్య పరికరాలు ఉన్నాయి. ఈ నురుగును అదుపు చేయాలని సిబ్బంది, రోగులు మొర పెట్టుకుంటున్నారు. లేకుంటే అత్యాధునిక వైద్య పరికరాలు పాడైపోయే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. నురుగునీటిని అరికట్టాలని అక్కడి సిబ్బంది వైద్యాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే లేరని వాపోతున్నారు. ఈ విషయమై నిలోఫర్‌ ఆసుపత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఎస్‌.రవికుమార్‌ను 'సాక్షి' వివరణ కోరగా ఎక్కడా పైప్‌లైన్‌ లీకేజీ కాలేదని, అది వాషింగ్‌ నీరంటూ కొట్టిపారేశారు.


మ్యాన్‌హోల్‌ లీకై బయటకు వస్తున్న కెమికల్‌ నీరు

నుమాయిష్‌లో స్టాళ్ల కేటాయింపుపై రగడ?

అబిడ్స్‌: నుమాయిష్‌లో స్టాళ్ల కేటాయింపు అంశం వివాదాస్పదంగా మారిందని తెలిసింది. దీనిపై ఓ సీనియర్‌ సభ్యుడు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎగ్జిబిషన్‌లో ప్రైమ్‌ స్టాళ్లకు ధరలు నిర్ణయించేది ఎవరు? నిర్ణయించిన ధరలకు మేనేజింగ్‌ కమిటీ ఆమోదం ఉందా? వాటి ద్వారా ఇప్పటి వరకు వసూలైన రుసుము వివరాలను తెలియజేయాలంటూ ఎగ్జిబిషన్‌ సొసైటీ సీనియర్‌ సభ్యుడు ఒకరు సొసైటీ కార్యదర్శికి లిఖిత పూర్వకంగా కోరడం ఎగ్జిబిషన్‌ సొసైటీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 83 ఏళ్ల చరిత్రలో తొలిసారి ప్రైమ్‌ పేరుతో స్టాళ్ల కేటాయింపులో సొసైటీకి చెందిన ఓ పదాధికారి అత్యుత్సాహం సంస్థ ప్రతిష్ఠతను దెబ్బతీసేలా ఉందని ఆ సభ్యుడు సొసైటీ కార్యదర్శికి అందజేసిన లేఖలో పేర్కొనడం గమనార్హం. ప్రైమ్‌ స్టాళ్లను పొందిన కొందరు వ్యక్తులు డబ్బులు సొసైటీకి చెల్లించకుండా ఎగ్గొడుతున్నారని సభ్యుడు ఆరోపించినట్లు తెలిసింది.ఎగ్జిబిషన్‌ సొసైటీలో కొన్నేళ్లుగా స్టాళ్ల వివరాలు, ఆదాయం గురించి కనీసం మేనేజింగ్‌ కమిటీ సభ్యులకు కూడా తెలియపర్చకపోవడం ఏంటని ప్రశ్నించినట్లు సమాచారం. ప్రస్తుతం ఎగ్జిబిషన్‌ సొసైటీలోని వాట్సాప్‌ గ్రూపుల్లో ఈ అంశం చక్కర్లు కొడుతోందని తెలిసింది.

ఎట్టకేలకు బాపుఘాట్‌లో చెత్త తొలగింపు

సాక్షి ఎఫెక్ట్‌..

లంగర్‌హౌస్‌: బాపుఘాట్‌లో చెత్తను ఎట్టకేలకు అధికారులు బుధవారం తొలగించారు. వివరాల్లోకి వెళ్తే.. లంగర్‌హౌస్‌లోని బాపు ధ్యాన మందిరం ప్రాంతంలో గాంధీ జయంతి, వర్ధంతి సందర్భంగా బాపు సమాధి, ధ్యాన మందిరం లోపల సర్వమత ప్రార్థనలు నిర్వహించే ప్రాంతం, బాపు విగ్రహాన్ని పూలతో అలంకరిస్తారు. అయితే గవర్నర్‌, సీఎం నివాళులర్పించి వెళ్లిన తర్వాత వాటిని తొలగించి బాపుఘాట్‌ ప్రాంగణంలోనే పారేశారు. అయితే ఏడాదిగా చెత్త అలాగే ఉండిపోవడంతో ఈ విషయమై 'సాక్షి'లో ఈ నెల 27న 'చెత్తను తొలగించరా..?' అనే శీర్షికన కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించి చెత్తను తొలగించారు.


శుభ్రంగా మారిన బాపుఘాట్‌

ఫిబ్రవరి 1న సన్నాహక సమావేశం

సుల్తాన్‌బజార్‌: ఫిబ్రవరి 1న 'లక్ష డప్పులు-వేయిగొంతులు' హైదరాబాద్‌ జిల్లా సన్నాహక సదస్సు నిర్వహించనున్నట్లు ఎంఎస్‌పీ హైదరాబాద్‌ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్‌ మల్లికార్జున మాదిగ పిలుపునిచ్చారు. గోషామహల్‌ నియోజకవర్గంలోని గుఫామందిర్‌ మాదిగ బస్తీలో బుధవారం కళాకారులు డప్పుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్‌ నాయకుడు మునిరాతి అరుణ్‌కుమార్‌ మాదిగ మాట్లాడుతూ.. 1న జరిగే సన్నాహక సమావేశానికి రాష్ట్ర కళామండలి అధ్యక్షుడు మాలెపాలక అనిల్‌ మాదిగ, డప్పు కళాకారులు రాష్ట్ర అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్‌ మాదిగల బృందం ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్‌ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి, డప్పు మల్లికార్జున్‌ మాదిగ పాల్గొననున్నట్లు తెలిపారు. డప్పు కళాకారుల ప్రదర్శనలో స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు

చికిత్స పొందుతూ బాలుడి మృతి


అసద్‌

లంగర్‌హౌస్‌: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందిన ఘటన లంగర్‌హౌస్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. లంగర్‌హౌస్‌ బాగ్దాద్‌ కాలనీలో నివాసముండే ముబీనాకు పాతబస్తీకి చెందిన జాబ్రితో 8 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. నాలుగేళ్ల క్రితం వీరు విడాకులు తీసుకోగా ప్రస్తుతం ముబీనా ఇద్దరు కుమారులతో కలిసి లంగర్‌హౌస్‌ బాగ్దాద్‌కాలనీలో తల్లి వద్దే ఉంటోంది. వీరి రెండో కుమారుడు అసద్‌ (3) ఈనెల 20న ఇంట్లో ఆడుకుంటూ గుర్తు తెలియని ద్రావణం తాగాడు. కొద్ది సమయం తర్వాత బాలుడి నోట్లో నుంచి నురగలు రావడంతో గమనించిన కుటుంబీకులు చికిత్స కోసం వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం బాలుడి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి

దూద్‌బౌలి: తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యతో పాటు క్రీడాల్లోనూ రాణించేలా ప్రోత్సహించాలని ఇన్‌కాం ట్యాక్స్‌ అసిస్టెంట్‌ కమిషనర్‌ (ఐఆర్‌ఎస్‌) జివి ధనలక్ష్మి అన్నారు. ముస్లిం గర్ల్స్‌ అసోసియేషన్‌ బింతుల్‌ ముస్లిం కౌన్సిల్‌ ఆధ్వర్యంలో కుండా స్టేడియంలో బుధవారం నిర్వహించిన 'బింతుల్‌-2025 గర్ల్స్‌ స్పోర్ట్స్‌ మీట్‌' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడారంగంలో రాణించివారికి ప్రభుత్వాలు మంచి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. విద్యార్థులకు ఇలాంటి స్పోర్ట్స్‌ మీట్‌ కార్యక్రమాలు నిర్వహించడంపై నిర్వాహకులను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్‌ కోచింగ్‌ ఫౌండేషన్‌ కార్యదర్శి కామిల్ల సాయిబాబాతో పాటు సుల్తానా నజీర్‌, డాక్టర్‌ అస్మ, మీడియా ఇన్‌చార్జి తలహా జబీన్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'మంత్రనగరి'



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నాటక రంగ సంస్థ రసరంజనీ ఆధ్వర్యంలో బుధవారం రవీంద్రభారతిలో ప్రదర్శించిన మంత్రనగరి నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రస్తుత సమాజంలో మానవాళి అంతా ఆర్టిఫిషియల్‌ ఇంటలిజెన్స్‌ మాయలో పడి తాము మనుషులమన్న సంగతి మరిచి యంత్రాల్లా బతుకున్న తీరును కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ప్రేమలు, పలకరింపులు, ఆప్యాయతలు మరిచిపోయిన స్థితిని ప్రదర్శించిన తీరు ప్రేక్షకులను ఆలోచింపజేసింది. చైతన్య కళాస్రవంతి సమర్పణలో సాగిన ఈ నాటకాన్ని మాడభూషి దివాకర్‌బాబు రచించగా బాలాజీ నాయక్‌ దర్శకత్వం వహించారు. కార్యక్రమంలో రసరంజనీ కార్యవర్గ సభ్యులు, రంగస్థల నాటక ప్రియులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

రాజేంద్రనగర్‌: బుద్వేల్‌ చింతల్‌బస్తీ బస్తీ దవాఖానా ప్రాంతంలో బుధవారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరానికి పరిసర ప్రాంతాల ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. చిన జీయర్‌ స్వామి జిమ్స్‌ కాలేజీ, హాస్పిటల్‌ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్య శిబిరాన్ని అందుబాటులో ఉంచారు. పరిసర ప్రాంతాలకు చెందిన దాదాపు 120 మంది రోగులు పాల్గొని వైద్య సేవలను పొందారు. వారికి వైద్య సేవలు అందించడంతో పాటు ఉచితంగా హోమియో మందులను అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ... ప్రతి బుధవారం చింతల్‌ బస్తీలోని బస్తీ దవాఖానా వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. హోమియో వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మౌని అమావాస్య పూజలు

గోల్కొండ: మౌని అమావాస్యను పురస్కరించుకుని బుధవారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. షేక్‌పేట్‌, టోలిచౌకీతో పాటు గోల్కొండ, గుడిమల్కాపూర్‌ తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. గోల్కొండ రిసాలబజార్‌లోని శివాలయంలో బీజేపీ టోలిచౌకీ డివిజన్‌ అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి పూజలు చేశారు. పూజల్లో శ్రీ గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో..

గౌలిపురా: గౌలిపురా బతుకమ్మ బావి వద్ద గల శ్రీలక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో పరమశివుడికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం తదితర పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఛత్రినాక పాత పోలీస్‌స్టేషన్‌ వద్ద భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా వైశ్య ప్రొఫెషనల్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు దేసు శ్రీనివాస్‌ గుప్తా, ప్రధాన కార్యదర్శి లబిశెట్టి ప్రణీత్‌ కుమార్‌ గుప్తా, కోశాధికారి జి.శ్రీనివాస్‌ రావు హాజరయ్యారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు శ్రీరాం కోటయ్య గుప్తా, సలహాదారులు, ప్రధాన కార్యదర్శి శ్రీధర మల్లికార్జున్‌ గుప్తా, కోశాధికారి ఇరుకుల్ల భిక్షపతి గుప్తా, ఉపాధ్యక్షులు గుబ్బ శ్రీనివాస్‌ గుప్తా, పడకంటి వెంకటేశం గుప్తా, రేణుగుంట శ్రీనివాస్‌ గుప్తా, సరాబు ఉదయ్‌ భాస్కర్‌ గుప్తా, గౌరిశెట్టి విశ్వనాథం గుప్తా పాల్గొన్నారు.

అన్నదానం..

సుల్తాన్‌బజార్‌: మౌని అమావాస్యను పురస్కరించుకుని బీజేపీ నాయకుడు విజయశర్మ ఆధ్వర్యంలో జాంబాగ్‌ చౌరస్తాలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్‌ అగర్వాల్‌, మాధవి అగర్వాల్‌, రుతిక శర్మతో పాటు ప్రజలు పాల్గొన్నారు.

శ్రీ నల్లపోచమ్మ, తుల్జాభవానీ ఆలయంలో..

జియాగూడ: సంజయ్‌నగర్‌లో గల శ్రీ నల్లపోచమ్మ, తుల్జాభవానీ ఆలయంలో పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు మధ్యాహ్నం అఖండ హారతి, చివరగా ఆలయ ప్రతినిధి రావుల శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో మహా అన్నదానం చేపట్టారు.

గోశాలలో ..

అబిడ్స్‌: అఫ్జల్‌గంజ్‌, ఇమ్లిబన్‌, బేగంబజార్‌ గోశాలలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. భజరంగ్‌సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌ఆర్‌.లక్ష్మణ్‌రావు గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించి వాటికి దాణా తినిపించారు. కార్యక్రమంలో రఘునందన్‌ యాదవ్‌, గౌతమ్‌జైన్‌, రాజేందర్‌ యాదవ్‌, శ్యామ్‌ యాదవ్‌, నీల తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం నిర్వహిస్తున్న వంశీ కృష్ణ తదితరులు


గోశాలలో దాణా పెడుతున్న ఎన్‌ఆర్‌.లక్ష్మణ్‌రావు

యుక్త వయసు నిర్ణయాలపైనే భవిష్యత్‌

ఏజీవర్సిటీ: యువత తలుచుకుంటే సాధించనిది ఏదీ ఉండదని... యుక్త వయసులో తీసుకునే నిర్ణయాలు కీలకంగా వారి భవిష్యత్‌ను నిర్దేశిస్తాయని తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ ఎం.ఎ.కరీం అన్నారు. బుధవారం రాజేంద్రనగర్‌లోని సీటీఐ కాన్ఫరెన్స్‌ హాల్‌లో యువజన క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ట్రైబల్‌ యూత్‌ ఎక్సేంజ్‌ ప్రోగాంను నిర్వహించారు. ప్రధాన శిక్షకుడిగా పాల్గొన్న ఆయన యువతకు మానసిక శక్తి సామర్థ్యాలపై శిక్షణ ఇచ్చారు. జీవితంలో అత్యంత కీలకమైనది యవ్వన దశ అని ఈ దశలో తీసుకున్న నిర్ణయాల ఆధారంగానే భవిత్యం ఆధారపడి ఉంటుందని ఈ సందర్భంగా కరీం పేర్కొన్నారు. స్మార్ట్‌ ఫోన్‌లో అధిక సమయం గడిపే వారు మానసిక రుగ్మతల బారిన పడున్నారని అన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

గోల్కొండ: షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్‌ కాలేజీలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ విభాగం ఆధ్వర్యంలో 'రోడ్డు ప్రమాదాల నివారణపై' బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టోలిచౌకిలోని పశ్చిమ మండలం ఆర్టీవో జి.రవికుమార్‌ మాట్లాడుతూ.. వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్‌ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ ధరించాలని, ఫోర్‌ వీలర్‌ వాహనదారులు సీట్‌ బెల్ట్‌ పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.రమేశ్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌ డాక్టర్‌ నీలి రమేశ్‌, ఇన్‌చార్జి హెచ్‌వోడీ డాక్టర్‌ ఎం.అపర్ణ, మహిళా సెల్‌ అధికారి డాక్టర్‌ కె.రమ్య, అధ్యాపకులు, విద్యార్థిలు పాల్గొన్నారు.


కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, విద్యార్థులు

మందకృష్ణ మాదిగ నేతృత్వంలోనే న్యాయం


మాట్లాడుతున్న ఎంఎస్‌ఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు సందే కార్తీక్‌

గోల్కొండ: ఎమ్మార్పీఎస్‌ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని ఎంఎస్‌ఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు సందే కార్తీక్‌మాదిగ అన్నారు. మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు వరించడంతో కార్వాన్‌లోని ప్రభుత్వ హాస్టల్‌లో ఎంఎస్‌ఎఫ్‌ ఆధ్వర్యంలో బుధవారం కేక్‌ కట్‌ చేసి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలకు పైగా మందకృష్ణ మాదిగ చేసిన అలుపెరగని పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ కల సాకరమవుతుందన్నారు. ఫిబ్రవరి 7న నిర్వహించనున్న 'లక్ష డప్పులు-వేయిగొంతులు' కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామన్నారు. డాక్టర్‌ పి.సుధాకర్‌మాదిగ మాట్లాడుతూ.. వర్గీకరణ వల్ల ముందుగా లబ్ధిపొందేది విద్యార్థులే అని అన్నారు. మందకృష్ణ చేసిన పోరాటానికే కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ఇచ్చిందని ఇది మాదిగ జాతికే కాకుండా హక్కుల కోసం పోరాడే గొంతుకల విజయానికి నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని హైదరాబాద్‌ జిల్లా సంక్షేమ హాస్టల్స్‌ ఇన్‌చార్జి మంద అనిల్‌ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో జన్నపాల మహేశ్‌మాదిగ, ఈదుల రాజుప్రదీప్‌ మాదిగ, విద్యార్థులు పాల్గొన్నారు.

మహావీర్‌, రిషభదేవ్‌ జయంతికి సెలవు ప్రకటించాలి

సుల్తాన్‌బజార్‌: జైన్‌ సమాజానికి చెందిన మొదటి తీర్థంకరుడు రిషభదేవ్‌, 24వ తీర్థంకరుడు లార్డ్‌ మహావీర్‌ జయంతిలను సెలవుదినంగా ప్రకటించాలని హైదరాబాద్‌ జాయింట్‌ కమిటీ ప్రతినిధి బృందం కోరింది. ఈ మేరకు తెలంగాణ బీజేపీ ఆర్గనైజేషన్‌ మంత్రి చంద్రశేఖర్‌, రాజ్యసభ ఎంపీ కె.లక్ష్మణ్‌ను బుధవారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌ జైన్‌ కమిటీ ప్రతినిధులు రిదేష్‌ జాగిర్దార్‌, ముఖేష్‌ చౌహాన్‌ మాట్లాడుతూ.. మార్చి, ఏప్రిల్‌లో మహావీర్‌, రిషభదేవ్‌ జయంతిలు వస్తుండడంతో ఆ రోజున సెలవులు ఇవ్వడంతో పాటు దేశవ్యాప్తంగా మాంసం దుకాణాలు మూసివేయాలని కోరామన్నారు. జైన్‌ సామాజిక వర్గానికి సంబంధించిన కీలకమైన అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని ఎంపీ హామీనిచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో జైన్‌ రత్న జస్‌రాజ్‌ శ్రీమల్‌, ముఖేష్‌ జైన్‌ చౌహాన్‌, స్వాతి జైన్‌, ఆనంద్‌ బోహ్రా, ఆర్‌కె.జైన్‌, దినేశ్‌తో పాటు పలువురు జైన్‌ సంఘం ప్రముఖులు పాల్గొన్నారు.


ఎంపీ లక్ష్మణ్‌, మంత్రి చంద్రశేఖర్‌ తో జైన్‌ సంఘం ప్రతినిధులు

'లక్ష డప్పులు-వేయి గొంతులు'ను జయప్రదం చేయాలి


కార్వాన్‌ నియోజకవర్గ సభలో పాల్గొన్న ప్రతినిధులు

జియాగూడ: ఫిబ్రవరి 7న నిర్వహించనున్న 'లక్ష డప్పులు-వేయి గొంతులు' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర నాయకుడు కుమ్మరి సత్యనారాయణ పిలుపునిచ్చారు. జియాగూడలో ఇమాంపురాలోగా కమ్యూనిటీ హాల్‌లో నవ భారత సంఘం అధ్యక్షుడు మధిర సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్వాన్‌ మాదిగ రిజర్వేషన్‌ పోరాట సమితి సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ పోరాటం వల్ల సుప్రీం కోర్టు గతేడాది ఆగస్టు 1న ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రభుత్వాలకు వర్గీకరణ చేయాలని స్పష్టంగా తీర్పు ఇచ్చిందన్నారు. మొదట్లో సీఎం రేవంత్‌రెడ్డి చేస్తానని హామీఇచ్చారని, ఇంతలో మాల కులస్తుల ఒత్తిడి కారణంగా వెనకంజ వేశారన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు ఎం.మహేశ్‌బాబు, సి.బాబు, శ్రీకాంత్‌, ప్రేమ్‌కుమార్‌, లక్ష్మీనారాయణ, గౌతమ్‌, ఉమరాజ్‌, నర్సింగ్‌రావు, ఎమ్మార్పీఎస్‌ నాయకులు కె.సత్యనారాయణ, వివిఎస్‌ రాజు, చంద్రమోహన్‌, నవీన్‌, దేవరాజ్‌, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

లంగర్‌హౌస్‌లో కార్డన్‌సెర్చ్‌

లంగర్‌హౌస్‌: లంగర్‌హౌస్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌లో బుధవారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్‌సెర్చ్‌ నిర్వహించారు. ఈనెల 30న (నేడు) పక్కనే బాపుఘాట్‌లో గాంధీ వర్ధంతి సందర్భంగా గవర్నర్‌, సీఎం, మంత్రులు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో ఏసీపీ సయ్యద్‌ ఫయాజ్‌, ఇన్‌స్పెక్టర్‌ రఘుకుమార్‌ ఆధ్వర్యంలో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు 65 మంది సిబ్బందితో ఐదు బృందాలు 180 ఇళ్లలో సోదాలు నిర్వహించి నలుగురు రౌడీషీటర్లను అదుపులోకి తీసుకున్నారు. అలాగే 4 అక్రమ గ్యాస్‌సిలిండర్లు, గుట్కాలు, అక్రమంగా నిల్వ చేసిన మద్యం, పాన్‌ షాప్‌లో మత్తు చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. 64 ద్విచక్ర వాహనాలు తరలించగా 49 వాహనాల పత్రాలు చూపించి, పెండింగ్‌ చలాన్లు చెల్లించిన తర్వాత యజమానులకు తిరిగి అప్పగించారు. నంబర్‌ ప్లేట్లు, పత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలను సీజ్‌ చేశారు. అనంతరం సంగం రాంలీలా మైదానంలో సమావేశంలో ఏసీపీ సయ్యద్‌ ఫయాజ్‌ మాట్లాడారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్లు సైదులు, రాజేందర్‌, ఎస్సైలు రాఘవేంద్ర, రాజులు పాల్గొన్నారు.


ద్విచక్రవాహనాలను పరిశీలిస్తున్న ఏసీపీ సయ్యద్‌ ఫయాజ్‌

నిరుద్యోగులకు వరం ఆధునిక సాంకేతిక కేంద్రాలు


డైరీని ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

నాంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆధునిక సాంకేతిక కేంద్రాలు (ఏటీసీ)లు నిరుపేద విద్యార్థులకు వర ప్రదాయనిగా నిలుస్తాయని తెలంగాణ గెజిటెడ్‌ అధికారుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. టీజీఓ కేంద్ర సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఉపాధి, శిక్షణ శాఖ డైరీ, కేలండర్ల ఆవిష్కరణ సభ బుధవారం జరిగింది. ఆయన హాజరై డైరీ, కేలండర్లను ఆవిష్కరించి ప్రసంగించారు. ఉపాధి, శిక్షణ శాఖ యువతరానికి చాలా ముఖ్యమైనదని, పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యం గల వ్యక్తులను తయారు చేసేందుకు దోహదపడుతుందన్నారు. ఐటీఐల్లో చాలావరకు నిరుపేదలు చదువుతారని, వీరికి నైపుణ్యమైన విద్య, శిక్షణను అందజేయాలని సూచించారు. టీజీఓ ఉపాధి, శిక్షణ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఇక్కడ శిక్షణ పొందే విద్యార్థులు దేశ విదేశాల్లో ఉపాధి పొందుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీజీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, మహిళా విభాగం చైర్మన్‌ జి.దీపారెడ్డి, పరమేశ్వరరెడ్డి, హైదరాబాద్‌ జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణయాదవ్‌, ఉపాధి, శిక్షణ శాఖ రాష్ట్ర కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సంగీత నృత్య కళాశాల వార్షికోత్సవం

సుల్తాన్‌బజార్‌: తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రామ్‌కోఠిలోని శ్రీ త్యాగరాజ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల 72వ వార్షికోత్సవాలు బుధవారం రాత్రి ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్‌ మామిడి హరికృష్ణ హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు వివిధ సంగీత వాయిద్యాలను వాయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ సి.పాండురంగ్‌ ముతాలిక్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

